## చర్చలతో ఉద్రిక్తతలు తగ్గించుకోండి

**ఇరాన్ అధ్యక్షుడికి మోదీ ఫోన్**

న్యూఢిల్లీ: ఇరాన్ అణు స్థావరాలపై అమెరికా దాడి చేసిన కొన్ని గంటలకే భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెస్కియన్‌తో ఆదివారం ఫోన్లో మాట్లాడారు. చర్చలు, దౌత్యం ద్వారా ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని పిలుపునిచ్చారు. దీనిపై మోదీ సామాజిక మధ్యమాల్లో పోస్ట్ చేస్తూ తాజా ఘర్షణలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రత, సుస్థిరతకు వెంటనే చర్చలు జరపాలని ఇరాన్‌కు సూచించారు.



## తీవ్ర ఆందోళనకు గురిచేసింది

ఇరాన్‌పై అమెరికా బలప్రయోగం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. చూస్తుంటే ఇది వేగంగా నియంత్రణ కోల్పోయేలా కనిపిస్తున్నది. ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని సభ్యదేశాలకు పిలుపునిస్తున్నాను. దీనికి సైనిక పరిష్కారం లేదు.. ఉన్నదల్లా దౌత్య మార్గం ఒక్కటే.

–ఆంటోనియో గుటెరస్, ఐరాస సెక్రటరీ జనరల్

## ఇది బాధ్యతా రాహిత్యం

ఒక సార్వభౌమ దేశాన్ని క్షిపణి, బాంబు దాడులతో భయపెట్టాలనుకోవడం బాధ్యతారహిత నిర్ణయం. దాని వెనుక ఎలాంటి వాదన ఉన్నా అది సమర్థనీయం కాదు. ఇది అంతర్జాతీయ చట్టాన్ని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను, ఐరాస భద్రతామండలి తీర్మానాన్ని తీవ్రంగా ఉల్లంఘిస్తుంది. అమెరికా దాడి మధ్యప్రాచ్యంలో సంఘర్షణ ప్రమాదాన్ని మరింత పెంచింది. ఉద్రిక్తతలకు ముగింపు పలికి రాజకీయ, దౌత్యపరంగా పరిస్థితులు పునరుద్ధరించడానికి ప్రయత్నం చేయాలి. –రష్యా

## అమెరికా దాడులు ప్రమాదకరమైన మలుపు

పశ్చిమాసియాలో సైనిక జోక్యం తరచూ దీర్ఘకాలిక సంఘర్షణలు, ప్రాంతీయ అస్థిరత సహా ఊహించని పరిణామాలకు దారితీస్తుందని చరిత్ర పదేపదే నిరూపించింది. 2003లో ఇరాక్‌పై అమెరికా దాడే అందుకు ఉదాహరణ. సైనిక చర్య కంటే కూర్చుని మాట్లాడుకోవడం ద్వారానే మధ్యప్రాచ్యంలో స్థిరత్వం సిద్ధిస్తుంది. –చైనా

## ఇది అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనే

ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడులను ఖండిస్తున్నాం. అంతర్జాతీయ చట్టంలోని అన్ని నిబంధనలను ఈ దాడులు పూర్తిగా ఉల్లంఘించాయి. ఈ దాడులను ప్రతిఘటించే హక్కు ఇరాన్‌కు ఉంది. ఇరాన్‌పై కొనసాగుతున్న దురాక్రమణ కారణంగా తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు, హింస పెరగడం కలవరపెడుతున్నది. ఈ ఉద్రిక్తతలు మరింత పెరిగితే దాని ప్రభావం ఇంటా, బయట తీవ్రంగా ఉంటుంది. –పాక్

## అమెరికా దాడి సబబే

ప్రస్తుత సంక్షోభాన్ని దౌత్యపరంగా ముగించేందుకు ఇరాన్ చర్చలకు రావాలి. అస్థిరమైన ఈ ప్రాంతంలో స్థిరత్వానికే ప్రాధాన్యం ఇవ్వాలి. అణ్వాయుధాన్ని అభివృద్ధి చేసేందుకు ఇరాన్‌కు ఎప్పటికీ అనుమతించకూడదు. ఆ ముప్పును తగ్గించేందుకే అమెరికా చర్యలు తీసుకుంది.

–బ్రిటన్

## భరించలేని సంఘర్షణకు దారితీయవచ్చు


అమెరికా బాంబుదాడి ఏ దేశం కూడా భరించలేని ప్రాంతీయ సంఘర్షణకు దారితీయవచ్చు. ఈ భూభాగం, ఈ ప్రాంతంలో జరిగిన యుద్ధాలకు భారీ మూల్యం చెల్లించుకున్నట్టు లెబనాన్, దాని నాయకత్వం, పార్టీలకు గతంలో కంటే ఇప్పుడు బాగా అర్థమైంది. అత్యున్నత జాతీయ ప్రయోజనాలకు కచ్చితంగా కట్టుబడి ఉండటం మనకు చాలా ముఖ్యం. –లెబనాన్

## ఇరాన్ పోరాటానికి మా మద్దతు

జియోనిస్ట్ అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా ఇరాన్ జరుపుతున్న పోరాటంలో హౌతీల మద్దతు ఉంటుంది. అమెరికా దురహంకారానికి వ్యతిరేకంగా జిహాద్‌లో ముస్లిం దేశాలు కలిసిరావాలి.

–హౌతీ పొలిటికల్ బ్యూరో

# బీ–2 బాంబర్లు.. బంకర్ బస్టర్లు



## ఇరాన్‌పై అమెరికా దాడి చేసింది వీటితోనే

*వాషింగ్టన్, జూన్ 22: ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంలో తాజాగా అమెరికా కూడా చేరింది. ఆదివారం టెహ్రాన్‌లోని మూడు కీలక అణు కేంద్రాలపై కచ్చితమైన బాంబు దాడులతో విరుచుకుపడింది. ఫోర్డో, నతాంజ్, ఇస్ఫాహన్‌లోని అణు కేంద్రాలపై జరిపిన ఈ దాడుల కోసం అమెరికా తమ అమ్ముల పొదిలోని అత్యాధునిక ఆయుధాలను వినియోగించింది. వాటిలో బీ–2 బాంబర్లు, భయంకరమైన జీబీయూ–57 బంకర్ బస్టర్లు, తొమహాక్ క్రూయిజ్ క్షిపణులు ఉన్నాయి. వాటి వివరాలు ఇవీ..*

**బీ–2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లు**



*అమెరికా అమ్ములపొదిలోని అత్యాధునిక, వ్యూహాత్మక ఆయుధాల్లో ఒకటైన బీ–2 బాంబర్లు అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను సైతం ఏమార్చి కచ్చితమైన దాడుల (ప్రెసిషన్ అటాక్స్)తో విరుచుకుపడగలవు. 40 వేల పౌండ్ల (18 వేల కిలోల) మందుగుండు సామగ్రిని మోసుకెళ్లగలిగే ఈ 'రాకాసి' యుద్ధ విమానాలు అత్యంత రక్షణ కలిగిన లక్ష్యాలను సైతం నాశనం చేయగలవు. స్టెల్త్ ఫీచర్లను కలిగి ఉండే ఈ బాంబర్లను గుర్తించడం, ట్రాక్ చేయడం, ప్రతిఘటించడం చాలా కష్టం. ప్రపంచంలో ఇప్పటివరకు ఉన్న సైనిక విమానాల్లో ఇదే అత్యంత ఖరీదైనది. ఒక్కో బీ–2 బాంబర్ ఖరీదు దాదాపు 210 కోట్ల డాలర్లు (రూ.18,182 కోట్లు). నార్త్‌రోప్ గ్రమ్మన్ కంపెనీ తయారు చేసిన ఈ భారీ, లాంగ్–రేంజ్ బాంబర్ మార్గం మధ్యలో ఇంధనాన్ని నింపుకోకుండా ఏకబిగిన దాదాపు 7 వేల మైళ్లు (11 వేల కిలోమీటర్లు), ఒకసారి రీఫ్యూయలింగ్‌తో 11,500 మైళ్లు (18,500 కిలోమీటర్లు) ప్రయాణించగలదు. ప్రపంచంలోని ఏ ప్రాంతానికైనా కేవలం గంటల వ్యవధిలోనే చేరుకోగలదు.*

**జీబీయూ–57 బంకర్ బస్టర్లు**



*జీబీయూ–57 అనేది 30 వేల పౌండ్ల (దాదాపు 13,600 కిలోల) బరువుండే భారీ బాంబు. పేలిపోయే ముందు ఇది భూగర్భంలో 200 అడుగుల (దాదాపు 61 మీటర్ల) లోతుకు చొచ్చుకుపోతుంది. అందుకే దీనికి 'బంకర్ బస్టర్' అనే పేరు వచ్చింది. అమెరికా వద్ద ఉన్న బంకర్ బస్టర్లలో ఇదే అత్యంత శక్తివంతమైనది. దాదాపు 20 అడుగుల పొడవు, 2.6 అడుగుల వ్యాసం ఉండే ఈ అధునాతన ఆయుధాన్ని బోయింగ్ సంస్థ డిజైన్ చేయగా.. ఎయిర్‌ఫోర్స్ రిసెర్చ్ ల్యాబొరేటరీకి చెందిన మ్యునిషన్స్ డైరెక్టరేట్ అభివృద్ధి చేసింది. ఆదివారం ఇరాన్‌పై జరిపిన దాడుల్లో అమెరికా 12 బంకర్ బస్టర్లను ఉపయోగించినట్టు తెలుస్తున్నది.*

**తొమహాక్ క్రూయిజ్ క్షిపణులు**




*లోతైన భూతల దాడులకు ఉపయోగించే ఈ దీర్ఘశ్రేణి క్రూయిజ్ క్షిపణిని అమెరికా నౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగించవచ్చు. ఉపగ్రహం నుంచి అందే సమాచారం ఆధారంగా మార్గం మధ్యలో లక్ష్యాలను మార్చుకోగలిగే ఈ క్షిపణి 1970వ దశకంలో ప్రచ్ఛన్న యుద్ధం వేళ తొలిసారి తెరపైకి వచ్చింది. జనరల్ డైనమిక్స్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ మిసైల్ 1983 నాటికి అమెరికా సైన్యం చేతికి వచ్చింది. 'ఆపరేషన్ డిజర్ట్ స్టార్మ్' పేరిట ఇరాక్‌పై 1991లో అమెరికా జరిపిన యుద్ధంలో తొలిసారి వినియోగించిన తొమహాక్ క్షిపణులను ఆ తర్వాత లిబియాలో జరిగిన ఆపరేషన్ 'ఒడిస్సీ డాన్', సిరియాలో జరిగిన ఆపరేషన్ 'ఇన్హెరెంట్ రిజాల్వ్'లో కూడా ఉపయోగించారు.*

**ఎఫ్–22 రాప్టర్, ఎఫ్–35ఏ లైట్నింగ్–2 ఫైటర్లు**



*ఇరాన్‌పై దాడులకు అమెరికా ఎఫ్–22 రాప్టర్, ఎఫ్–35ఏ లైట్నింగ్ యుద్ధ విమానాలను కూడా ఉపయోగించినట్టు తెలుస్తున్నది. స్టెల్త్, సూపర్ క్రూయిజ్, ఇంటిగ్రేటెడ్ ఏవియానిక్ ఫీచర్లతో మిళితమై ఉండే ఎఫ్–22 రాప్టర్‌ను వేగంగా, దూరంగా గగనతల ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు, అమెరికా దాడిని అడ్డగించేందుకు జరిగే ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు రూపొందించబడింది. కాగా, ఎఫ్–35ఏ లైట్నింగ్ ఫైటర్ అనేది అమెరికా వాయుసేనలోని ఐదో తరం యుద్ధ విమానం. అత్యాధునిక స్టెల్త్ సామర్థ్యాలను కలిగి ఉండే ఈ విమానాన్ని అన్ని రకాల వాతావరణ పరిస్థితుల్లో దాడులు నిర్వహించేందుకు అనువుగా రూపొందించారు. 51 అడుగుల పొడవు, 35 అడుగుల వింగ్‌స్పాన్ (రెక్కల వెడల్పు) ఉండే ఈ ఫైటర్ 8 వేలకుపైగా కిలోల పేలోడ్‌ను మోసుకెళ్లగలదు.*




## ఏయే అణు కేంద్రాలపై దాడి?

వాషింగ్టన్, జూన్ 20: అమెరికా బీ స్పిరిట్ బాంబర్లు ఆదివారం ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు కేంద్రాలపై దాడి చేసి విజయవంతంగా వెనుదిరిగాయి. ఈ క్రమంలో ఆ అణు కేంద్రాల ప్రాముఖ్యం గురించి తెలుసుకుందాం.

- **ఫోర్డో:** భూగర్భంలో నిర్మించిన యురేనియం శుద్ధి కేంద్రం. ఇరాన్‌లో కోమ్ సమీపంలోని పర్వతం కింద దీనిని ఏర్పాటు చేశారు. ఇది టెహ్రాన్‌కు నైరుతిలో 100 కి.మీ దూరంలో ఉంది. ఇది కూడా సెంట్రిఫ్యూజ్ క్యాస్‌కేడ్‌లను కలిగి ఉంది. అయితే నతాంజ్ అంత పెద్దది కాదు. దీని నిర్మాణాన్ని 2007లో ప్రారంభించినప్పటికీ ఇరాన్ దాని గురించి బయటి ప్రపంచానికి చెప్పలేదు. అమెరికా, దాని పశ్చిమ మిత్ర దేశాలు ఈ అణు కేంద్రం గురించి ఐఏఈఏకు ఫిర్యాదు చేసిన తర్వాత దీని గురించి 2009లో మాత్రమే ఇరాన్ వెల్లడించింది. కొండ గర్భంలో ఉన్న దీనిని విమాన నిరోధక బ్యాటరీలు నిరంతరం రక్షిస్తుంటాయి. దీనిని బంకర్ బ్లస్టర్ బాంబులు తప్ప మిగతావి ఏమీ చేయలేవని మిలిటరీ నిపుణులు తెలిపారు. సుమారు 13,600 కి.మీ బరువుండే గైడెడ్ బాంబులు మాత్రమే దీనిని విచ్ఛిన్నం చేయగలవు. ఈ బాంబులను బీ2 స్పిరిట్ బాంబర్లు మాత్రమే మోసుకుని వెళ్లగలవు. అందుకే అమెరికా ఆదివారం వాటిని ప్రయోగించింది.
- **నతాంజ్:** ప్రధాన యురేనియం శుద్ధి కేంద్రం. పెద్ద భూగర్భ సముదాయం. అధునాతన సెంట్రిఫ్యూజ్‌లను కలిగి ఉన్నది. ఇది టెహ్రాన్ ఆగ్నేయానికి 220 కి.మీ దూరంలో ఉంది. దీనిపై ఇప్పటికే ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఇక్కడ యురేనియంను 60 శాతం వరకు శుద్ధి చేశారు. అణ్వాయుధ తయారీ స్థాయికి ఇది దగ్గరగా ఉంది. ఇజ్రాయెల్ ఇటీవల దాడిలో దానిలోని సెంట్రీఫ్యూజ్‌లు ధ్వంసమయ్యాయని, తద్వారా ఆ కేంద్రంలో అంధకారం అలుముకుందని ఐఏఈఏ తెలిపింది.
- **ఇస్ఫాహన్:** ఇదొక యురేనియం మార్పిడి కేంద్రం. ఎల్లోకేక్‌ను యురేనియం హెక్సాఫ్లోరైడ్ (యూఎఫ్6) వాయువుగా ప్రాసెస్ చేస్తుంది. దానికి ఇతర కేంద్రాల్లో శుద్ధి చేస్తారు. టెహ్రాన్‌కు ఆగ్నేయంగా 350 కి.మీ దూరంలో ఇది ఉంది. దేశ అణు కార్యక్రమానికి సంబంధించిన మూడు చైనా పరిశోధనా రియాక్టర్లు, ప్రయోగశాలలకు ఇది నిలయంగా ఉంది.



## ఫోర్డో అణు కేంద్రం ముందే ఖాళీ?

*టెహ్రాన్, జూన్ 22: అమెరికా బాంబు దాడులను ఊహించిన ఇరాన్, కీలక అణు కేంద్రం నుంచి సామగ్రినంతటినీ ముందుగానే సర్దేసిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వాదనను బలపరుస్తూ ఉపగ్రహ చిత్రాలు కూడా విడుదలయ్యాయి. అమెరికా దాడి చేసే సమయానికంటే ముందే ఫోర్డో అణు కేంద్రం నుంచి కీలక పరికరాలు, యురేనియాన్ని ఇరాన్ మరో చోటకు తరలించినట్టు అనుమానిస్తున్నారు. జూన్ 19–20 రాత్రి ఉపగ్రహ చిత్రాల్లో ఇక్కడ భారీ సంఖ్యలో ట్రక్కులు ఇతర వాహనాలు బారులు తీరి కనిపించాయి. జూన్ 19న 16 కార్గో ట్రక్కులు అణు కేంద్రం సొరంగంలోకి ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఇక 20వ తేదీన అక్కడికి కిలోమీటర్ దూరంలో చాలా ట్రక్కులు ఆగి వున్నట్టు గుర్తించారు. ప్రధాన కేంద్రంలోకి వెళ్లే మార్గంలో కొన్ని బుల్డోజర్లు కూడా కనిపించాయి. దాడుల్ని ముందుగా అంచనా వేసిందనే విధంగా ఇరాన్ చర్యలు ఉన్నాయి. టెహ్రాన్‌కు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫోర్డో అణు కేంద్రం, వైమానిక బాంబు దాడులను తట్టుకునేలా ఒక పర్వతానికి అడుగుభాగాన నిర్మించారు.*



*టెల్ అవీవ్‌లో ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఏర్పాటైన బ్యానర్*

## బలప్రయోగంతోనే శాంతి!


**నిరూపించిన డొనాల్డ్ ట్రంప్**

**అమెరికా అధ్యక్షుడిపై నెతన్యాహు ప్రశంసలు**

*జెరూసలేం: ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడికి అమెరికా అధ్యక్షుడు ఎంతో సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రశంసించారు. ట్రంప్ చర్య 'బలప్రయోగంతోనే శాంతి' నెలకొంటుందన్న అంశాన్ని వెల్లడించిందని, భవిష్యత్తులో పశ్చిమాసియాలో శాంతికి, శ్రేయస్సుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. మీ ధర్మబద్ధమైన నిర్ణయం చరిత్రను మారుస్తుంది అని వ్యాఖ్యానించారు. రైజింగ్ లయన్ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్ ఎన్నో అద్భుతాలు చేసిందని, కానీ అమెరికా తన చర్యలతో అజేయంగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ దేశమూ చేయలేని పనిని అమెరికా చేసిందని కొనియాడారు. అత్యంత ప్రమాదకరమైన పాలకులను, అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలను నిలువరించిన ట్రంప్‌ను చరిత్ర జ్ఞాపకముంచుకొంటుందని వ్యాఖ్యానించారు. బలప్రయోగం ద్వారానే శాంతి అని తాను, ట్రంప్ తరచుగా చెప్పేవారిమని నెతన్యాహు గుర్తుచేశారు.*

# హర్మూజ్ జలసంధి మూసివేత!

- **ఇరాన్ పార్లమెంట్ నిర్ణయం**
- **ప్రపంచ ఆయిల్ అవసరాల్లో 20% ఇక్కడి నుంచే రవాణా**
- **చమురు ధరలు పెరిగే అవకాశం**
- **బ్యారెల్‌పై 10 డాలర్లు పెరిగితే దేశ జీడీపీ 0.5% ప్రభావితం**
- **భారత్‌పై ప్రభావం తక్కువే**




టెహ్రాన్, జూన్ 22: ఇజ్రాయెల్, అమెరికా బాంబు దాడులతో తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగింది. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మూజ్ జలసంధిని మూసివేయాలని నిర్ణయించింది. ఇందుకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపింది. అయితే దీనిపై ఇంకా ఆ దేశ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అరేబియా సముద్రాన్ని పర్షియన్ గల్ఫ్‌తో అనుసంధానం చేసే ఈ జలసంధి అత్యంత ఇరుకుగా.. ఒకచోట 30 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. ప్రపంచ ఇంధనానికి అత్యంత కీలకమైన ధమని వంటిది. ఈ సలజంధి ద్వారా అత్యధికంగా చమురు రవాణా అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజువారీ చమురు, గ్యాస్ అవసరాల్లో 20 శాతం ఈ హర్మూజ్ ద్వారానే రవాణా అవుతుంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ఓ ద్వీపకల్పానికి, ఇరాన్‌కు మధ్య ఈ ఇరుకైన జలసంధి ఉంది. ఈ మార్గం నుంచి రోజూ సగటున రెండు కోట్ల బ్యారెళ్ల చమురు, 29 కోట్ల క్యూబిక్ మీటర్ల ఎల్ఎన్‌జీని వివిధ దేశాలకు రవాణా చేస్తారు. సౌదీ అరేబియా, ఇరాన్, అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అయ్యే చమురును ఈ మార్గం నుంచే పంపుతారు. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ (ద్రవ రూపంలో ఉండే సహజవాయువు) కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. అమెరికా వైమానిక దాడుల నేపథ్యంలో ఇరాన్ తీసుకున్న ఈ కీలక నిర్ణయంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడనుంది. ఈ జలసంధి నుండి రవాణా అయ్యే 84 శాతం చమురు, 83 శాతం ఎల్ఎన్‌జీ ఆసియా మార్కెట్లకే వెళ్తుందని అమెరికా ఇంధన సమాచార సంస్థ తెలిపింది. ఇందులో 69 శాతం చమురు భారత్, చైనా, జపాన్, దక్షిణకొరియా దేశాలకు వెళ్తుంది.

**భారత్‌పైనా ప్రభావం**

హర్మూజ్ మూసివేతతో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సరఫరా తీవ్రంగా ప్రభావితం కానుంది. ముఖ్యంగా ముడి చమురు దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలపై ఈ ప్రభావం ఉంటుందని అంచనా వేస్తున్నారు. చమురు ధరలు పెరిగితే ఆ ప్రభావం భారత్‌పై కూడా ఉంటుందని విదేశీ వ్యవహారాల నిపుణుడు రాబిందర్ సచ్‌దేవ్ చెప్పారు. ప్రపంచ మార్కెట్‌లో ఇప్పటివరకు 60 నుంచి 65 డాలర్ల వరకు ఉన్న బ్యారెల్ ధర 80 డాలర్ల వరకు పెరగవచ్చని భావిస్తున్నారు. బ్యారెల్‌పై 10 డాలర్లు పెరిగితే దేశ జీడీపీ 0.5 శాతం ప్రభావితం అవుతుందని రాబిందర్ వివరించారు. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరుగుతుందని, ఆయిల్ ధరలు పెరగవచ్చని అన్నారు. ఇక భారత్‌కు చమురు దిగుమతుల విషయంలో ప్రత్యామ్నాయాలు ఉన్న నేపథ్యంలో హర్మూజ్ ప్రభావం తక్కువేనని భావిస్తున్నారు.హర్మూజ్ జలసంధి మూసివేయాలన్న ఇరాన్ నిర్ణయం ప్రభావం భారత్‌పై ఉంటుందని, అయితే అది అంత ఆందోళనకరం కాదని నిపుణులు పేర్కొంటున్నారు. భారత్ ప్రతి రోజు 55 లక్షల బ్యారెళ్ల ముడిచమురును దిగుమతి చేసుకుంటుండగా.. అందులో 20 లక్షల బ్యారెళ్లు ఈ జలసంధి గుండానే వస్తాయి. హర్మూజ్ మూసివేతతో భారత్ రష్యా, అమెరికా, బ్రెజిల్, పశ్చిమ ఆఫ్రికా దేశాలపై ఆధారపడవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత్‌కు ప్రధాన వనరుగా ఉన్న రష్యా తన చమురు రవాణాకు హర్మూజ్‌పై ఎక్కువగా ఆధారపడదు.

# ఇరాన్‌పై అమెరికా భీకర దాడి

మొదటిపేజీ తరువాయి...

బీ–2 స్టెల్త్ బాంబర్లతో దాడి చేసింది. జలాంతర్గామి నుంచి ప్రయోగించిన స్టెల్త్ బాంబర్లు రెండు అణు కేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులను జారవిడువగా, మరో అణు కేంద్రంపై క్షిపణులతో దాడికి పాల్పడింది. బంకర్ బస్టర్ బాంబులు భూగర్భంలోని బంకర్లలోకి చొచ్చుకుపోయి అణు కేంద్రాలను ధ్వంసం చేశాయి.

**ఫోర్డో ధ్వంసం**

దాడుల అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో దేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇరాన్‌లోని కీలకమైన అణు కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేశామని ప్రకటించారు. 'అయితే శాంతి నెలకొంటుంది లేదా ఇరాన్‌కు విషాదం మిగులుతుంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా చట్టసభల అనుమతి లేకుండానే ట్రంప్ ఇరాన్‌పై దాడులకు అనుమతినిచ్చారు. గత తొమ్మిది రోజులుగా ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా తన దాడులను కొనసాగిస్తుందా లేదా అన్నది స్పష్టం కాలేదు. అమెరికా దళాలపై టెహ్రాన్ ప్రతీకారానికి పాల్పడితే మరిన్ని దాడులు జరుపుతామని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్‌లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ఫోర్డో అణుశుద్ధి కేంద్రాన్ని సంపూర్ణంగా ధ్వంసం చేశామని చెప్పారు. దానిపై ఆరు బంకర్ బస్టర్ బాంబులను వేశామని తెలిపారు. ఇస్ఫహాన్, నతాంజ్‌పై తమ జలాంతర్గామి దాదాపు 440 మైళ్ల దూరం నుంచి 30 తోమహాక్ క్షిపణులను ప్రయోగించిందని చెప్పారు. బంకర్ బస్టర్ బాంబులు ఆరింటిని ఉపయోగించామని తెలిపారు. తమ యుద్ధ విమానాలన్నీ ఇరాన్ గగనతలం నుంచి వెలుపలికి వచ్చేశాయని అన్నారు. 'ఇది అమెరికా, ఇజ్రాయెల్ తోపాటు ప్రపంచానికి చారిత్రక సమయం. ఇప్పుడైనా ఇరాన్ ఈ యుద్ధానికి ముగింపు పలికేందుకు అంగీకరించాలి' అని తన ట్రంప్ వ్యాఖ్యానించారు.

### ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్

ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై జరిపిన దాడికి అమెరికా 'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్ (అర్ధరాత్రి సుత్తి దెబ్బ) అని పేరు పెట్టింది. ఎంతో పకడ్బందీగా, వ్యూహాత్మకంగా జరిపిన ఈ దాడిని అమెరికా దళాలు 25 నిమిషాల్లో ముగించాయి. దాదాపు 125 యుద్ధ విమానాలు దాడిలో పాల్గొన్నాయి. ఈ దాడుల్లో ఏడు బీ–2 స్టెల్త్ బాంబర్లను అమెరికా ఉపయోగించింది. ఈ బాంబర్లు 13,600 కిలోల బరువున్న డజనుకు పైగా బాంబులను ఇరాన్‌లోని రెండు అణు కేంద్రాలు ఫోర్డో, నతాంజ్‌పై జారవిడిచాయి. ఇస్ఫహాన్ అణు కేంద్రంపై తోమాహాక్ క్షిపణలు వేశామని అమెరికా సైనిక ఉన్నతాధికారి కెయిన్ చెప్పారు. తమ విమానాలను ఇరాన్ దళాలు ప్రతిఘటించలేదని అన్నారు. ఇరాన్‌లోని ఉపరితలం నుంచి గగనతలంపైకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ కంటపడకుండా తాము తిరిగి వచ్చామని చెప్పారు.

**శాశ్వత గాయం చేస్తాం: ఇరాన్**

అగ్రరాజ్యం దాడులపై స్పందించిన ఇరాన్.. అమెరికా ఓ ప్రమాదకరమైన యుద్ధాన్ని ప్రారంభించింది అని వ్యాఖ్యానించింది. ఇరాన్‌లోని ఫోర్డో, ఇస్ఫహాన్, నతాంజ్ కేంద్రాలు దాడికి గురైన మాట నిజమేనని ఇరాన్ అణు ఇంధన సంస్థ ధ్రువీకరించింది. అయితే తాము అణు కార్యక్రమాన్ని ఆపేది లేదని స్పష్టం చేసింది. దాడికి గురైన మూడు కేంద్రాల నుంచి ఎటువంటి రేడియో ధార్మిక ప్రభావం వెలువడలేదని ఇరాన్, ఐరాస పేర్కొన్నాయి. ఇజ్రాయెల్‌కు మద్దతుగా యుద్ధంలో దిగిన అమెరికా 'దౌత్య విధానానికి ద్రోహం చేసింది' అని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరగ్చి ఆరోపించారు. 'అమెరికా తనంతట తానుగా ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓ ప్రమాదకర యుద్ధాన్ని ప్రారంభించింది' అని వ్యాఖ్యానించారు. ఇక అగ్రరాజ్యానికి శాశ్వత గాయం ఖాయమైందని అన్నారు. అమెరికా సైనిక దురాక్రమణను, దాని దుష్ట పాలకులను సంపూర్ణ శక్తితో ప్రతిఘటించే హక్కు ఇరాన్‌కు ఉందని పేర్కొన్నారు. ఈ ఘర్షణను అమెరికా అధ్యక్షుడు ప్రారంభించారు.. మేము అంతం చేస్తాం అని వ్యాఖ్యానించారు. పశ్చిమాసియాలోని అమెరికా పౌరులు, సైనిక సిబ్బందిని లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ అధికారిక మీడియా హెచ్చరించింది. అమెరికా అతిపెద్ద నేరం చేసిందని, ఇకపై దానికి పశ్చిమాసియాలో స్థానం లేదని పేర్కొంది.

**ఇరాన్‌తో యుద్ధం కోరడం లేదు**

ఇరాన్‌తో తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ అన్నారు. తమ దాడుల అనంతరం తమ దేశంతో చర్చలు జరిపే మరో అవకాశం ఇరాన్‌కు లభించిందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు. ఇరాన్‌లో పాలకులను మార్చడం కోసం తాము ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్‌ను చేపట్టలేదని హెగ్సెత్ చెప్పారు. ఇరాన్ ఇప్పటికైనా శాంతి మార్గాన్ని అనుసరించవచ్చు లేదా ఉగ్రవాదులకు నిధులు సమకూర్చే వ్యూహాన్ని అనుసరించవచ్చు అని అన్నారు.

